# ఎండమావులు ★

రచన: 'సౌజన్య'

ఆవేళ ఫస్టు తారీకు! మనసెంతసేపూ పనిమీదకు పోవడంలేదు! అవయవా లసలే పనిచేయనని బిర్రబిగిసాయి!

నాకు చేతికి అందే జీతం పదినయా పైసలు తక్కువ నూటపదిరూపాయలు.

వచ్చే జీతంలోనుండి తీర్చవలసిన బాకీల బాపతు లెక్కలలో మునిగి తేలు తోంది నాబుర్ర.

ఎలాగైనా సరే ఈ నెల అన్ని బాకీలూ తీర్చాలి. ఇంకో ముఖ్యకర్తవ్యము ఖాతాకొట్టులో బాకీ పూర్తిగా చెల్లించి ఇక జన్మలో ఖాతాపెట్టకూడదు. ఇవి నా తీర్మానాలలో ముఖ్యమైనది.

అబ్బ ఆ కిరాణాకొట్టు షావుకారు కొట్టులో ఏముహూర్తాన ఖాతా ప్రారంభించానోగాని ఏ నెలకు ఆనెలే అతని కొట్టులో ఖాతా పెట్టకూడదు అనుకోవడం చివరకు నెల తిరిగి వచ్చేలోగా పాపం పెరిగినట్లు బాకీ పెరిగిపోవడం జరుగుతోంది! ఆ షావుకారుమాత్రం తక్కువవాడా రొక్కమిచ్చి తనకొట్టులో సరకు కొన్నవాళ్ళకు ఒక ధర, ఖాతా పెట్టినవాళ్ళకు వేరే ధర, వాళ్ళకొక కొలత వీళ్ళకొక కొలత.

దానికి కారణమేమి? ఏముంది గతి లేనట్లు, అరువు ఇస్తున్నాడగదా అని అతనిదగ్గరే అన్నీ కొనుచున్నాను. కొనకేమిచేయాలి? వాడుతప్పితే ఈ ప్రాంతములో మరొకడు ఖాతా పెట్టనివ్వడాయె అందుకని వడ్డీకి వడ్డీకలుపుకుని సరుకులిస్తాడు.

ఏమిటో! ఈ పీడ వదిలించుకోవాలని నాలుగు నెలలనుండి భగీరథ యత్నం చేస్తున్నా కాని అసాధ్యమై పోతోంది.



ఏనెలకు ఆనెలే అకస్మాత్తుగా ఏవో ఖర్చులు రావడం నేను వేసుకున్న అంచనా తారుమారవడం జరుగుతోంది.

అటువంటివేమీ ఈ నెలలో కనుపించుట లేదుగదా అని నా మనసు కొంచెం తృప్తి చెందింది.

అంతలో బంట్రోతు బసవన్న వచ్చి "జీతాలు తీసుకోవడానికి రమ్మంటున్నారు"



ఇరవైతొమ్మిది రోజులనుండి ఎప్పుడు చేతికివస్తుందా అని చూస్తున్న జీతపు రాళ్లు చేతికి వచ్చినై. ఇంటికి బయలుదేరాను.

జేబు బరువుగానే ఉంది. రోడ్డుమీద ఉత్సాహంగానే నడక సాగిస్తున్నాను. కాళ్లు తేలికగా పడుతున్నాయి. కంఠం కూనిరాగాలు తీస్తోంది! నా కెదురుగా పది గజాల దూరంలో ఒక కుర్రాడు చేతిలో ఏదో పొట్లం పెట్టుకుని ఒక్కొకటే తింటూ వస్తున్నాడు. అతను కూడ ఉత్సాహంతో కూనిరాగాలు తీస్తున్నాడు. పాపం! ఎక్కడచూచిందో గద్ద చప్పుడు లేకుండావచ్చి అవలీలగా ఆ కుర్రాడు చేతిలో పొట్లాం తన్నుకుపోయింది!

అతన్ని చూస్తే నాకు జాలేసింది. కుర్రాడు బిక్కముఖంపెట్టి నిరాశతో ఆ గద్దవేపే చూస్తూ నిలబడిపోయాడు.

"ఏమిటబ్బాయి?" అన్నాను కుర్రాణ్ణి సమీపిస్తూ.

"గెద్దండి! ఒక మారాజు బజారు నుండి కూరగాయలబుట్ట మోయించుకుని ఒక అణా ఇచ్చారు. దాంతో నేను మిఠాయికొమ్ములు కొనుక్కొని తింటూ

వస్తున్నాను. గ్రద్ద తన్నుకుపోయిందండీ" అన్నాడు ఇంకా గ్రద్ద పోయిన వేపే చూస్తూ. వాడి పరిస్థితిచూస్తే నా గుండె ఎండలో పెట్టిన వెన్నముద్దలా కరిగిపోయింది. నా జేబులోనుండి ఒక అణా తీసి యిచ్చేవరకు నాకు ప్రశాంతత లేకపోయింది.

ఆ కుర్రాడు సంతోషంతో వెనుకకు తిరిగి చూస్తూ మిఠాయి కొట్టువేపు వెళ్ళిపోయాడు.

నేను మళ్ళా యథాతథంగా నడచి పోతున్నాను. ఎదురుగా ఎవరో ఒక పెద్ద మనిషి రిక్షాలో వస్తున్నాడు. దగ్గరగా వచ్చాడు ఇంకేవను మా యింటివోనరు గున్నయ్యగారే. ఆయన రిక్షావాడితో రిక్షా ఆపమని చెప్పి నాతో "ఏమండోయ్ గోపాలంగారూ మీ గురించే ఇలా వస్తున్నాను. నేను తొందరపనిమీద విజయవాడ వెళ్ళుతున్నాను. ఇదే ప్రయాణం మీగురించి ఇంటివద్ద అడిగాను. మీరింకా ఇంటికి రాలేదన్నారు. ఎలాగూ ఎదురుపడతారు గదా అని వస్తున్నాను. అడబోయిన తీర్థం ఎదురైనట్లు మీరే ఎదురొచ్చారు" అంటూ గున్నయ్యగారు బొజ్జ క్రిందకూ పైకి వూగసాగింది ;

"కొంపతీసి ఇంటి అద్దెగాని అడుగడుగదా!" అనుకుంటూ ఉండగానే "ఈ వేళ మీ జీతాలు తీసుకున్నారటగా?" అన్నారు. నేను గుటకవేస్తూ అవునన్నాను ఆయన మళ్ళా ఉపన్యాసం ప్రారంభించారు. "నాకు అకస్మాత్తుగా ఎక్స్‌ప్రెస్ ఉత్తరం రావడంవల్ల బెజవాడ వెళుతున్నాను. మా తమ్ముడు ఏదో ఇల్లు కొన్నాట్ట డబ్బు తీసుకురమ్మన్నాడు. డబ్బు సరిపాయేలాలేదు. మీరిచ్చేపదిహేను రూపాయలు గాక మరో పదిహేనుకూడా అడ్వాన్సుగ ఇవ్వండి" అన్నారు. ఆ ఉపన్యాసం వినేటప్పటికి నాకు ముచ్చెమటలు పోసినాయి.

"ఈనెల నాకు చాలాఖర్చులువున్నాయండి. మీరు ఈ నెలకు అడగరుగదా అనుకున్నాను. పైగా ఇంకో పదిహేను రూపాయలా!" అన్నాను.

"అదికాదండి నేను మిమ్మల్ని ఎప్పుడైనా ఇలా అడిగానా? పైగా మీరు వరుసగా రెండు నెలలు, మూడు నెలలు ఇవ్వకపోయినా మాట్లాడేవాణ్ణా?"

ఇంక నేను మాట్లాడలేక జేబులో చేయిపెట్టి ముప్పై రూపాయిలు తీసి గున్నయ్యగార్కి సమర్పించాను.

మిఠాయిపొట్లం పోగొట్టుకున్న కుర్రవాడు గ్రద్దవేపు దీనంగా చూచినట్లుగానే రిక్షాలో పోతున్న గున్నయ్యగారి వేపు నేను చూడవలసివచ్చింది.

కాళ్ళు ఇందాకటికంటె కొంచంబరువుగానే పడుతున్నాయి. అల్లంత దూరములో ఒక పరిచితమైన యువకుడు నాకెదురుగా వస్తున్నాడు

కొంపతీసి బాస్కరరావుకాదు గదా! వాడైతే ముందే కాఫీ హొటలు అంటాడు. తరువాత 'షో' అంటాడు. వెధవకి పనీలేదు పాటాలేదు, నన్నే కాదు ఏమిత్రుడు కనిపించినా అంతే.

అనుకున్నట్లు భాస్కర్రావే! చచ్చాం ఏమిటి కర్తవ్యం? వాడు నన్నుచూడ లేదుకదా! అసలే ఈవేళ శాలరీ అందుతుందని వాడికి తెలుసు. వాడు బుర్ర పైకి ఎత్తలేదే నన్ను చూడలేనట్లేవుంది. అలా తలపోస్తూ దక్షిణంవేపు వీధికి తిరిగాను.

తప్పిందిరా గండం అనుకుంటూ వెనుకకు తిరిగిచూస్తూ నడచి పోతున్నాను. ఆంజనేయస్వామి ఆలయం దాటాను.

ఆవచ్చే జట్టెవరు?! ఆ మధ్య వాడు సూర్యం కాదూ? బందరు నుండి ఎప్పుడొచ్చాడె! ప్రక్కన రఘు చేరాడే! మూడోవాడు ఎవడుచెప్మా!

ఆనల్ల కళ్ళద్దాలూ వాడూనూ మధు కాదూ? అవును వాడే.

వీళ్లుముగ్గురు ఆభాస్కరరావునుతలదన్నినవాళ్లే! చచ్చానే అక్కడ ఒక్కడితోనే వదలిపోయేది. తప్పించుకు పోవడానికి చిన్న సందైనాలేదే! అదుగో ఆ సూర్యం నన్ను చూడనే చూశాడు. వాడి మందహాసం తగలెయ్యా వాడి ముఖానికి అదొకటి. వాళ్లకి ఉద్యోగాలూ సద్యోగాలూ లేవు తినడం తిరుగడం.

అయినా వాళ్ల తప్పేముందిలే చదివారు ప్యాసయ్యారు. దేశంలో నిరుద్యోగ సమస్య వాళ్ళను అలా చేసింది.

నిరుద్యోగ సమస్యమాత్రం ఎలాతీరుతుంది? ప్రతీదానికి ప్రభుత్వంమీదే ఆధారపడి నిరుద్యోగ సమస్య తీర్చమంటే ఎలా తీరుతుంది.

"ఏరా గోపాల్ అలా బిక్కముఖం పెట్టి వస్తున్నావు ఏమిజరిగిందేమిటి?" సూర్యం సమీపిస్తూనే అన్నాడు మందహాసంచేస్తూ.

లేనినవ్వు తెచ్చుకుంటూ "బందరు నుండి ఎప్పుడు వచ్చావురా సూర్యం?" అన్నాను.

"ఇవ్వాళేరా"

"జేబు ఎత్తుగా వుందేమిటిరా?" రఘు ఛలోక్తిగా అన్నాడు.

"తెలియదేమిటిరా? ఉద్యోగస్తులకు ఫస్టుతారీకులన్ని పండుగరోజులే! మధు సమర్థించాడు.

"వీడెవడురా ముందే జేబుగొడవ ఎత్తాడు." అని రఘును మనసులో నిందిస్తూ వుండగా "సినీమాకు వెళదామని బయలుదేరా మోయ్. ఇంటివద్ద నిగురించి అడిగాము. నీవు ఎలాగూ ఎదురు వస్తావుగదా అనుకుంటూ వస్తున్నాం" అన్నాడు సూర్యం.

"ఏడిసినట్లేవుంది" అనుకుని "ఇంటికి వెళ్ళొస్తానురా" అన్నాను.

"పెళ్ళైనవాళ్ళందరికి ఇల్లు ఇల్లనే గొడవరా" అంటూ రఘు వ్యాఖ్యానించాడు.

"మనం కబుర్లు చెబితేకాదు, సిని మాకు వేళౌతోంది" అన్నాడు మధు సినీమాదాటిపోతే ప్రాణం పోతుం దన్నట్లు.

"రావోయ్ పో చూ చి పో దాం" అన్నాడు సూర్యం.

వాడన్నమాట కాదనలేకపోయాను. నలుగురుం బయలుదేరాం. వెనుకకు తిరిగానేగాని నా మనసు ఇంటివద్దనే వుంది. కనీసం శ్రీమతికైనా చెప్పే అవ కాశం లే క పో యి ం దే. తీరావీళ్ళను కాదని వెళ్లిపోదామంటే వీళ్ళుసామాన్య మైనవాళ్లా. చిలుకాగోరువంకల్లా యీ వేళ శ్రీమతితో కలసి సినిమాకు వెళదా మనుకుంటే ఇదేమి ఖర్చనుకున్నాను.

"ఏరా ముఖం అముదం త్రాగిన వాడిలా పెట్టావు సినిమాఖర్చు నీమీద పడుతుందనా?" మధు మందహాసం చేస్తూ అన్నాడు.

"మనవాడి జేబు బరువుగావుంటే వుండే నీవు అలాఅంటావేమిట్రా. దాన కర్ణుడు లాంటివాడు మన గోపాల్" రఘు బలపరుస్తూ అన్నాడు

"చాల్లెండిరా ప్ర సం గా లు మీరు తప్పించుకుందామని వాణ్ణలా అంటు న్నారు. అన్నాడుసూర్యం సీరియస్‌గా.

సినీ థియేటరు సమీపించింది.

వీళ్లెలాగూ నన్ను వదిలేవాళ్లుకాదు.

"టిక్కెట్లు అమ్ముతున్నట్లున్నాడు" మధు హెచ్చరిక చేశాడు.

నిజానికి వాడిమీదనాకు ప ట్ట రా ని కోప మొచ్చింది. త తి మ్మా ఇద్దరూ వాళ్లనికానట్లు సినీ వాల్‌పోష్టర్లుచూస్తూ నిలబడ్డారు. ఇంక నాకు తప్పదని నేను నిర్ణయించుకుని వెళ్ళి నాలుగు కుర్చీ టిక్కెట్లు తీసుకువచ్చాను

"అరె! నేను తీసుకువద్దునుకదురా!" అన్నాడు రఘు జరిగిందంతా తనకేమీ తెలియనట్లు. వాడిమాటలు వినేసరికి నాకు అ రి కా లి మంట నెత్తికెక్కింది. హాల్లో కూర్చున్నాము అప్పు డప్పుడూ నల్లులబాధతప్ప ఆ మూడుగంటలూ సరదాగానే గడచిపోయింది. వాళ్లను సాగ నంపి ఇంటికి తిరిగివచ్చాను

అవి వేసవుకాలపు రోజులు చెమట పోయుటవల్ల కాబోలు మాశ్రీమతి కిటికీ తలుపులు తెఱచే పడుకుంది. లైట్లు వెలిగించే వున్నాయి. ఆమె బాగా ముస్తా బై నట్లే కనిపిస్తోంది.

పాపం! ఇవేళ సినిమాకు వెళదా మన్నానని కాబోలు అన్నీ అలంకరించు కుని సిద్ధంగావుంది. అలవాటు ప్రకారం నేనే పువ్వులు తెస్తానని చూచివుంటాది దౌర్భాగ్యుణ్ణి జీతాలు వచ్చిన రోజునైనా శ్రీమతితో ముచ్చటగా సినీమాకు వెళ్ళ లేక పోయాను.

నా పిలుపుతో శ్రీమతి బుంగమూతి పెట్టే తలుపు తీసింది. నిశ్శబ్దంగానే భోజనంకూడా అయిపోయింది. అవిడ మూతి ముడుపునుబట్టి చూస్తే శ్రీమతి చాలా చాలా కోపమొచ్చినట్లు తెలు స్తోంది.

భోజనంచేసి పడకగదిలోకి వచ్చాను. మా శ్రీమతి వంటింట్లో వంటసామాన్లు సర్దుతోంది. ఒక పాత్రతో మరోపాత్ర ఢీకొంటున్న శబ్దము ఖణేలు ఖణేలు మంటున్నాయి.

బహుశా అవి మా శ్రీ మ తి కోపం తాలూకు లక్షణాలే అ ను కు ం టా ను. అలావుండగా వంటింటి త లు లు పు కభేలుమనడం నాగుండె గబేలుమన డం, మాశ్రీమతి పడకగదిలోకి రావడం జరిగాయి.

ఆమె వచ్చేటప్పటికి నేను జేబులో నుండి మిగిలిన డబ్బుతీసి లెక్క పెడు తున్నాను. డబ్బైరూపాయలు పైచిలుకు మాత్రం మిగిలాయి.

"ఆఫీసుకు పోతే ఇంటివద్దవున్న వాళ్ళు జ్ఞాపకముంటే కాదూ" శ్రీమతి పిడుగుల్లాటి మాటలకు నా కర్ణపుటాలు దద్దరిల్లాయి.

జరిగిందంతా విన్నవించుకున్నాను నేరస్తునిమాదిరిగా.

ఆమెకు నాపరిస్థితి చూస్తే జాలేసి నట్లుంది. "అయితే ఇంక మిగిలిం దెంత?"

"నీవే చూడు" అ ం టూ ఇచ్చి తిని. తీర్చవలసిన బాకీలుకూడా చూపి తిని. వెంటనే నాదృష్టి ఆమెకట్టుకున్న క్రొత్త చీరమీదకు పోయింది. "క్రొత్త చీర కట్టుకున్నావెక్కడిది?!"

"అవునండి చెప్పడం మరచాను. ఇవ్వాళ చీరలమ్మొచ్చాయి. అందఱూ తీసుకుంటూ నన్నుకూడా తీసుకోమని చెప్పారు. ఐనా నేను మాట్లాడలేదు. అంతలో మన పక్కింటి పద్మావతిగారు నీవద్ద డబ్బులేకపోతే మీ వా రొ చ్చి న తర్వాత ఇద్దరుగాని అంటూ ఈ చీర పద్దెనిమిది రూపాయలకు బే ర ం చేసి డబ్బు తనే ఇచ్చింది. ఇవాళసినిమాకు వెళదామన్నారుగదా అని కట్టుకుని ఎంతసేపు చూచినా మీరు రారాయె అంటూ ఆమె చెప్పుకుపోతూ నా ముఖం వేపు చూసి, "అదేటండీ సినీమాలో రేలంగిఫోజులో ముఖంపెట్టారు"అంది.

ఏంచేయమంటావు ఏముహూర్తాన జీతం తీసుకున్నానో రెండు రో జు లు తర్వాత జేబులో రెండు అణాలైనా ఉంటాయా అని అనుమానంగావుంది."

"అవున్లెండి మీరెన్ని ఖర్చుపెట్టినా పరవాలేదు. నేను ఒక్కచీర కొనుక్కు న్నాననేగదా మీరలా అంటున్నారు" అని మూతిముడిచి మంచంమీద ఒరిగి పోయింది. అమెను స ము దా యి ం చి నిద్రపోయేటప్పటికి రాత్రి ప న్నె ం డు అయింది.

ఉదయాన్నే లేచి ఇవ్వవలసిన బాకీ లన్నీతీర్చి ఇంటికి తిరిగివచ్చాను. అను కున్న దొకటి అయిందివేరొకటి. లెక్క

చూస్తే చివరకు ఐదురూపాయల చిల్లర మిగిలింది.

మళ్ళీ కుర్చీలో కూలబడ్డాను. నాకు తలతిరిగిపోతోంది. ఎన్నాళ్లకో నేను సరిపడ్డ జీతంతో బ్రతికేది. నాకు చూస్తే మళ్ళీ బట్టలు చిరిగిపోయాయి. అదుగో ఆ చిలక కొయ్యకి తగిలించిన చొక్కా చూడు ఎలా వెక్కిరిస్తోందో! దాన్ని ప్రొద్దుట పెట్టిలోనుండిబయటకుతీశాను తీరా చూస్తె జానడు చిగిలిపోయివుంది వాడున్నాడే ఆ చాకలిరంగడు వేసిన బట్టల్లా చిరగ్గొట్టుకు రావడమే.

అలా అలా అనుకుంటూ వుండగా మా శ్రీమతి వంటింట్లోనుండి వస్తూ "అదేమిటండీ చప్పుడు లేకుండా ఇంట్లోకివచ్చి కూర్చున్నారు?!" అంటూ దగ్గరకొచ్చి "ఏమండీ! నిన్న తీయించుకున్న చీరకు తగిన జాకెట్టు లేదండి ఈనెలకు మిమ్మల్ని ఇంకేమి అడుగను ఒక్క జాకెట్ కూడా తీసుకువద్దురూ?" అంది నాగడ్డం పట్టుకుని లాలసగా.

మిగిలిన 5 రూపాయ లివిగో, ఖాతా కొట్టులో ఇంకా పదిహేను రూపాయలు వెనకపెట్టాను. దాంతో షావుకారు నోరావలించి "అదేమిటండి పదిహేను రూపాయలు వెనుకబెడితే మా వ్యాపారం ఎలా నడుస్తుంది చెప్పండి" అన్నాడు ఎలాగో ఆ షావుకార్ని సమాధాన పర్చాను.

అవునుగాని ఆ గడ్డం కాస్తాగీయించుకుందురూ బాగామాసింది" ఆమె అలా అనేవఱకు నాకు గడ్డం మాటే జ్ఞాపకం రాలేదు.

"అవును ఇప్పుడే వెళ్ళిగీయించుకు వస్తాను." అన్నాను.

మరైతే అలా బజారుకు కూడా వెళ్లి జాకెట్టుగుడ్డకూడా తీసుకువద్దురూ.

ఖాతాకొట్టులో అన్నీ తెచ్చుకున్నా చేతిలో ఐదు రూపాయిలైనా లేకపోతే ఎలా?"

"నాదగ్గర పదిరూపాయలువున్నాయిలెండి వాటితో చూచుకోవచ్చు"

"అబ్బా! నాకు తెలియకనే నీదగ్గర పది రూపాయ లున్నాయన్న మాట ! ఇలానీవు పొదుపుచేస్తే మనంకూడా కొన్నాళ్ళలో ఒక మేడ కట్టించవచ్చు అందుకే పదహారు చాంతాళ్ళు ముడివేసి నీరుతోడే నూతిలో నీటి అడుగున ఏమి ఉందో చెప్పగలంగాని ఆడవాళ్ల మనసులో ఏముందో చెప్పడం కష్టం, అన్నారెవరో.

"ఇంతకీ అవి మనవికాదండీ! మీరిచ్చిన చీరడబ్బు పద్మావతిగార్కి ఇవ్వబోతే నాదగ్గఱఖర్చైపోతాయి, ఒక పదిరూపాయలు మీవద్దనే వుంచండి మళ్లానెల్లో ఇద్దరుగాని అన్నారు" అంది.

"ఇలా ఐతే యీ సంసారసాగరం యీదటం మహాకష్టం. అందుకే సంసారం – సాగరం దుఃఖం అన్నారు." అంటూ ఆమెవేపు దీనంగా చూశాను.

"అలా చూస్తారేం? వచ్చినజీతం ఎలా సరిపోతుందనుకున్నారు? విడుదలైనప్రతి సినిమా చూడాలంటారు, ప్రతి నెలా బట్టలు తీయించుకోవాలి పూటకు నాలుగు కూరలు చొప్పున వుండాలంటారు, ఇస్త్రీబట్ట మడత నలిగితే అది పనికిరాదు. ఇలా మీరెంత ఖర్చుపెట్టినా సరే నేనెప్పుడైనా ఒక చీర కొంటే ముఖం అదోలా పెడతారు. ఖర్చుతగ్గించండో అని చెవిలో ఇల్లుకట్టి పోరాడుతున్నా మీరు వినరు. ఇలా అయితే మనకు పిల్లాజల్లా పుడితే ఏమైపోవాలండీ?!" అని మాశ్రీమతి ఉపన్యాస ధోరణిలో చెప్పేస్తుంటే నా చెవులకు వినడానికి మహా భారమనిపించింది

"ఆ చీరకు గులాబిరంగు జాకెట్టు అయితేనే బాగుంటుంది" "అలాగే" అంటూ వీధిలోకి నడిచాను.

అనాలోచితంగానే జేబులోకి చెయ్యి పోయింది. జేబులో ఒక ఐదురూపాయలనోటు, ఒక బేడకాసు పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాయి. గడ్డానికని కేటాయించిన బేడకాసు ఈ జేబులో ఎందుకని మరో జేబులో వడేశాను. అలాపోతూనే ఎదురుగా చూశాను. మా ఆఫీసరు వస్తున్నారు. ఆయన సమీపించి "ఏమోయ్ గోపాలం! సమయానికే కలిశావు. రా! బాటాకంపెనీలో మా కుఱ్ఱాడు ఒక చెప్పులజోడు కొనాలంటున్నాడు. నీవు సెలక్టు చేద్దువుగానిరా" అంటూ ఆయన నన్ను వెంటబెట్టుకు వెళ్ళారు.

చివరకు ఒక చెప్పులజోడు నాలుగు రూపాయల తొంబై ఐదు నయాపైసాలు ఖరీదు గలది తీసుకున్నారు.

బిల్లు చెల్లించేసమయంలో ఆయన ఎవరితోనో మాట్లాడుతూ వుండిపోయినాడు. ఎంతసేపటికి ఆమాటలు తెమలడం లేదు. ఇక బాగుండదని నేనేబిల్లు చెల్లించాను. తిరిగి ఐదునయాపైసాల బిళ్ళ వచ్చింది.

తిరావచ్చిన తర్వాత "అదేమిటి నేనిద్దునుకదూ" అంటూనే మా ఆఫీసరు గారు బయటకు త్రోవతీశారు. అంతేకాదు "వస్తాను పనిచూసుకో "అంటూ ఆయన వెళ్లిపోయారు. మా ఆఫీసరు గారు తరహాయేవేరు. అందఱూ గుళ్ళో లింగాన్ని మ్రింగితే ఆయన గుడినే మ్రింగుతారు.

ఓ నిట్టూర్పు విడచి ఇంటిముఖం పెట్టాను. ఏదో ఆలోచిస్తూ గడ్డంమీద చెయ్యివేసుకున్నాను.

"నాబాధైనా విదిలించుదువూ" అన్నట్లు చేతికి పెరిగిన గడ్డం గ్రుచ్చుకున్నది.

గడ్డంకోసం కేటాయించిన బేడకాసు గురించి జేబులో చెయ్యిపెట్టాను.

జేబులో బేడకాసులేదు సరిగదా బేడకాసంత చిల్లుంది! "ఎంతపని జరిగింది!" అనుకుని ఇంటికి చేరాను.

"ఏమండీ గడ్డం గీయించుకోకుండానే తిరిగొచ్చారు? జాకెట్టు గుడ్డేది? అలావున్నారేం? మిమ్మల్నేనండి మాట్లాడరేం?" అంటూ ప్రశ్నలవర్షం కురిపించింది మా శ్రీమతి.

"గడ్డం గీయించుకోకుండానే నా పని క్షౌరమయిందే!" అని విషయం చెప్పాను. "ఎంత ఆఫీసరైతేమాత్రం డబ్బుదగ్గఱ మొహమాట మేమిటండీ? అంది. ఆమెకేమితెలుసు మా ఆఫీసరు గారి సంగతి ?

మళ్ళీ అచేతనంగా కుర్చీలోకూర్చొని ఆలోచనలో పడ్డాను. జరిగిన విషయాలన్నీ నా బుఱ్ఱలో చలనచిత్రాలులా కదిలిపోతున్నాయి. యికముందైనా పొదుపుచేయాలనుకున్నాను. మరేమౌతుందో!!! ★